నిత్యమూ... నిరంతరమూ...

మునిగాళ్లపై నిల్చుని, విల్లులా వంగి అరఫర్లాంగు పొడవున్న వీధి మలుపు వరకూ కలయజూసిన తరువాత "యెప్పుడో యిట్ల చూస్తా చూస్తా కాలు జారి కిందపడి చస్తానేమో నేను..." అని నాలుకను కోపంగా కరచిపెట్టి గొణుక్కుంటూ వెనుదిరిగి, యింటిలోకొచ్చి "వీధిలో ట్రాఫిక్ కూడా తగ్గిపోయింది వదినా!" అంది షర్మిల.

సగం నిద్రలో సైతం యేడుస్తూ రాగాలు తీస్తున్న అయిదేళ్ల అమ్మాయిని జోకొడుతూ తలపైకెత్తి చూసి, కనుకొనుకుల్లోని కన్నీటి చుక్కని మోచేత్తో తుడుచుకుంటూ పెదవి నదోలా వంచి నవ్వడానికి ప్రయత్నించి విఫలురాలై పోయింది సుశీల.

నైట్ బల్బు వెలుతుర్లో గది వెలవెలబోతోంది.

నవారు మంచంపైన యేడేళ్ల అమ్మాయొకతి నిద్రపోతోంది. పిల్లలకు నిద్రాభంగం కలిగించకుండా బాగా వాల్యూం తగ్గించి పెట్టిన టీవీలో డిష్ సినిమా ప్రసార మవుతోంది. నేలపై పిల్లల బొమ్మలు చిందరవందరగా పడివున్నాయి. ట్యూబ్‌లైట్ వెలుగుతున్న అవతలివైపు గదిలోని వుయ్యాలలో యేడాది వయసున్న పాపాయి నిద్రపోతోంది. గోడపైని యెలక్ట్రానిక్ గోడ గడియారం కదలడం మానేసి చాలా రోజులై పోయినట్టుంది. బాత్‌రూంలోని కొళాయిలోంచీ నీటి గడియారంలా నీళ్లు టపటపమని శబ్దం చేస్తూ రాలుతున్నాయి. దోమల రాకని ఆపుతున్న మస్కిటో మాట్ వాసన గాఢంగా గదంతా వ్యాపించి వుంది.

సుశీల మరోసారి పాపాయి ఛాతీపైన చేయిపెట్టి చూసి, "వొళ్లు వేడిగానే వుంది. యీ సమయంలో డాక్టరు వుంటాడంటావా, వదినా!" అని ప్రశ్నించింది.

వో నిముషంసేపు ఆలోచించిన తర్వాత, "యేమో, యింటికెళ్లిపోయినా ఫరవాలేదులే! డాక్టరు యీయనకు ఫ్రెండే కదా! వాళ్లిల్లు డిస్పెన్సరీకి దగ్గరే. యింటికాడి కెళ్లినా చూస్తాడాయన" అంది షర్మిల.

గోడపైన పెద్ద పెద్ద మసీదుల ఫోటోల మధ్య యేదో లైసెన్సు తాలూకు ఫోటో కూడా వేలాడుతోంది. నిలువెత్తు అలమారులోని చాలా భాగాన్ని పెద్ద పెద్ద పుస్తకాలు ఆక్రమించుకున్నాయి.

ఎస్.కె. భాషా, చార్టెర్డ్ అకౌంటెంట్' అన్న అక్షరాలున్న ప్లాస్టిక్ బోర్డొకటి పుస్తకాల పక్కన తలకిందులుగా పడి వుంది.

టీవీ సినిమాతో లంకె కుదరడం సాధ్యం కాదని అర్థమయిన తర్వాత, ''యింట్లో ధర్మామీటరుందా?" అని అడిగింది సుశీల.

"వుంది, వదినా! చూస్తానుండు. ఆయనెక్కడో సర్దిపెట్టేసుంటారు" పైకి లేచి, అలమారులో వెదికి ధర్మామీటరు తీసుకొచ్చింది షర్మిల.

సుశీల ధర్మామీటరులో రీడింగ్ చూస్తూండగా – "నీకు ధర్మామీటరు చూసేదొచ్చునా?" అని ఆశ్చర్యపడిపోయింది షర్మిల.

"నూరు డిగ్రీలుంది జ్వరం. మందో, మాకో పోయకపోతే యెలా తగ్గుతుంది? వూరుగాని వూరికొచ్చాం కదా! పెళ్లాం పిల్లల్ని యిలా వదిలిపెట్టి పార్టీలకెళ్లిపోతే వాళ్ల గతేంగాను? అన్న వూసే లేదు వారికి. "సెలవు లెప్పుడొస్తాయా, యెప్పుడీ వూరు వచ్చి చిన్ననాటి స్నేహితుడితో వూరేగుదామా" అని వువ్విళ్లూరుతూ వుంటే, తీరా పరాయి వూళ్లోనయినా కొద్ది రోజులు కళ్లముందు నడయాడక పోతారా అని యెదురుచూశాను. రైలులో గంటల తరబడీ ప్రయాణం చేసి అలసిపోయానంటూ యీయన యీ ప్రోగ్రాం యివ్వాళే పెట్టుకోవాలా?" సుశీల గొంతులో విసుగ స్పష్టంగా ధ్వనించింది.

"నే నొద్దంటే ఆయన వింటారా? నువ్వూ చూసినావు గదా వదినా! అసలు యీ అన్న కోసరమనే ఆ సీసా యింట్లో యెత్తిపెట్టినానని నాతో యెన్నోసార్లు చెప్పినారు. తీరా ఆయనొచ్చినాక యింక వాళ్ల నాపేదానికి మనవల్లేమవుతాది చెప్పు! నేనేమో బిన్నాగా ముగించమని చెప్పే బాటిలిచ్చినాను" అంటూ వాపోయింది షర్మిల.

"యింట్లో మీ పాప మందులేమైనా వున్నాయా?" అని అడిగింది సుశీల.

షర్మిల అలమారు గాలించి మూడు టానిక్ సీసాల్ని వెలికితీసింది. "యివన్నీ పాప మందులే! జరం మందుకూడా వుండాల. యిదేననుకుంటా – పెట్టెపైన జ్వరం అని ఆయనే రాసిపెట్టినారు. నేను వేరే ఏదైనా పోసేస్తానేమోనని ఆయన భయం!"

సుశీల టానిక్ సీసాపైని లేబుల్‌నోసారి చదివి చూసిన తర్వాత పాపని బలవంతంగా లేపి కూర్చోబెట్టింది. దగ్గరికొచ్చి యేడుస్తున్న పాపని రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకుంది షర్మిల. పిల్లాడి చేతిలో చిక్కిన తుమ్మెదలా పాప విలవిలా కొట్టుకోసాగింది. బలవంతంగా పాప నోరు తెరిపించి మందు పోసింది సుశీల. సగం మందు పాప పెదవులపైన్నుంచీ జారి గౌనుపైన పడిపోయింది.

"యింకో సగం మూత పోద్దామా?" అంది షర్మిల.

"వద్దులే వదినా! కొంత గొంతు దిగింది గదా!" అంది సుశీల.

యుద్ధంలో వోడిపోయిన సైనికుడిలా పాప బుంగమూతి పెట్టుకుని దీర్ఘాలు తీయసాగింది.

మిద్దె మెట్లపైన టపటపమని అడుగుల శబ్దం వినిపించగానే, సుశీల ఆత్రుతతో తల పైకెత్తి చూసింది.

"అది హవాయి చెప్పుల చప్పుడు. సుగుణమ్మ! యేసుదాసు పెండ్లాం" అంది షర్మిల.

సుగుణమ్మ మిద్దె మెట్లెక్కి వరండాలో కొచ్చి నిల్చుంది. షర్మిల అటు వైపుకైనా చూడకుండా సుశీల ముందున్న మందుల సీసాల నెత్తుకుని అలమారులో సర్దసాగింది. అసలే పొట్టిగా వున్న సుగుణమ్మ మరింతగా వొంగిపోయి నిల్చుని బిక్కుబిక్కుమని చూస్తోంది. ఆమె కట్టుకున్న నాసిరకం నేత చీర రంగు చీకటితో కలసిపోయి వుంది. షర్మిల లోపల గదిలోకెళ్లి ఉయల్లోకి తొంగిచూసి, కాసేపు లోపలే తచ్చాడి ఆ తరువాత ముందు గదిలోకొచ్చింది. సుగుణమ్మ అలాగే వరండాలో నిల్చుని వుంది.

"యేం సుగుణమ్మా! యేం కావాలి?" అని తాపీగా ప్రశ్నించింది షర్మిల.

"డిష్ లో సినిమా..." సుగుణమ్మ నవ్వే ప్రయత్నమైనా చేయడం లేదు.

"యీ పొద్దేసిన సినిమాలో వొకటే ఫైటింగు. నీకు సరిపడదులే. రేపురా బో! వేరే సినిమా చూద్దువుగానిలే!"

సుగుణమ్మ అయిదారు నిముషాల వరకూ వేచిచూసి, యిక యివ్వాల్టికి తన కాహ్వానం దొరకదని నిర్ణయించుకున్న తర్వాత వెనుదిరిగింది.

"పోతే పోనీ అని పగుల్లో డిష్ సినిమా చూడనిచ్చిందానికి, పొద్దుగూకులూ అదే పనా? కొంచెం తావిస్తే చాలు! నెత్తిపై కొచ్చి కూర్చుంటారు" షర్మిల గొణుక్కుంటూ యేమంటావన్నట్టుగా సుశీలకేసి చూసింది.

ఆ మాటలు తన చెవిన బడనట్టుగా – "ఇంకీ రాత్రికి డాక్టరు దగ్గరికెళ్లడం లేదన్నమాటే గదా!" అంది ఆమె.

"యీ మగోళ్లెక్కడ తిష్టేసినారో, యేమో! సాయంత్రం బిడ్డకు వొళ్లు వుడుగ్గా వుండాదని నువ్వు చెప్పనుకూడా చెప్తివి గదా? మీ ఆయన కూడా మా ఆయనకు తీసిపొయ్యేట్టు లేదు వదినా?" అని అంతలో యేదో జ్ఞాపకం రాగా, గబగబా వరండాలోకి నడిచి, "సుగుణమ్మా! కొంచెం పైకొచ్చి పో!" అంటూ కేకేసింది షర్మిల.

సుగుణమ్మ మెట్లెక్కి, మిద్దెపైకొచ్చేసరికి షర్మిల కుర్చీలో దర్జాగా కూర్చుని వుంది.

ఆమె మౌనంగా నిల్చుంది.

"మీ ఆయనుండాడా ఇంట్లో?"

వున్నాడని తల పైకీ కిందికీ వూపుతూ తెలియజేసింది ఆమె.

"వాళ్ల సారూ, సార్‌వాళ్ల ఫ్రెండూ సాయంత్రమనగా టౌన్లోకి పోయినారు. యింట్లో ఆ అన్నోళ్ల బిడ్డకు జరంగా ఉంది. డాక్టరుకాడి కెళ్లాల! కొంచెం వూర్లోకెళ్లి వాళ్లేడుండారో చూసి రమ్మను!"

మరోసారి మూకాభినయం చేస్తూ అలాగేనని తెలియజేసింది ఆమె.

"తల వూపినట్టుగాదు. మరిచిపోకుండా చెప్పాల. ఆ టౌను క్లబ్బులో చూడమను. లేకపోతే రంగస్వామి వాళ్లింట్లో చూడమను. ముందా పని చేసి, వాళ్ల సార్‌ని చూసి, ఇంటికి రమ్మని చెప్పినాక, యింకో పని చెయ్యమన్నానని చెప్పు, పో! బిన్నా చెప్పు!"

సుగుణమ్మ చెప్పుల్ని టపటపలాడించుకుంటూ వెళ్లిపోయింది.

"చెప్తుందో లేదో! మూగెద్దు మాదిరి తలాడించమంటే మాత్రం పనికొస్తాది. కొట్టినా, కోసినా కదిలే రకం కాదు. చెప్తుందో, చెప్పదో!"

"యెవరావిడ?" అని అడిగింది సుశీల.

"యేసుదాసును చూళ్లేదా నువ్వు! మా ఆయన ఆఫీసులో క్లర్కు. సాయంత్రం మనకు సినిమా టికెట్లు తెచ్చిచ్చినాడు చూడూ, సన్నంగా, పొట్టిగా, నల్లగా – ముసిలి యెలుంగొడ్డు మాదిరుంటాడు. వాని పెండ్లాం. దీనితో పోలిస్తే యేసుదాసే మేలు. దీనికొళ్లంతా పొగురు. ఆ మొగుడికీ, దానికీ యేడెనిమిదేండ్లుగా మాటల్లేవు. వాడు వుప్పయితే, యిది నిప్పు!"

"వాళ్లు యేడేళ్లుగా మాటాడుకోవడం లేదా, యెందుకని?" సుశీల అడ్డు తగిలింది.

"యేం పాడో! యిద్దరి కిద్దరేలే! సమాచారం తెలుసుకుందామని చానాసార్లు కదిలించి చూసినాను. యేమడిగినా యిద్దరూ జవాబు చెప్పలేదు. జమ్మని రాజుల మాదిరి యిద్దరు మగబిడ్డలుండారు. దానికేమైనా కావాలంటే బిడ్డలతో చెప్తుందంట. అతనికేమైనా కావాలంటే వాళ్లతోనే చెప్తాడంట. వుండేదేమో వొకే కప్పు కింద. మాటలేమో లేవు. కడుపుమంట సంసారం. దానికి సిన్మాలూ, అతనికి బీడీలూ, ఇస్పేట్టాకులూ – వాళ్లకేదో రకంగా రాజీ కుదిరించమంటే మా ఆయన వుళ్లో పెత్తనాలు నీకెందుకని యెగిరిపడినాడు!"

"యేళ్ల తరబడీ మొగుడూ పెళ్లాలూ మాటాడుకోవడం లేదంటే యేదో పెద్ద గొడవే జరిగుంటది. యిరుగూ పొరుగూ వాళ్లకైనా తెలియదా యేం జరిగిందో?"

"ప్చ్! అయినా యీ టౌన్లలో పక్కింట్లో యేం జరగతా వుందో ఎవరు పట్టించుకుంటారు వదినా? మా ఆయనకింద క్లర్కు కాబట్టి నాదాకావచ్చింది ఆమాట. యేందో జరిగే వుంటుంది. అదేమైనా తప్పుడు పని చేసిందేమో! మొగోళ్లని తినేసేటట్టు చూస్తాదెప్పుడూ! అయినా ఆ మొగ మనిషి పగులూ, రేయి అవస్తలు పడి సాకతానే వుండాడు."

మొదటి సినిమా వదిలిపెట్టినట్టున్నారు.

లోపలి గదిలో ఉయ్యాల కింది నేలని పాపాయి తడిపేసింది, యేడవసాగింది.

డిష్‌లో డిస్టబెన్స్ రావడంతో టీవీ రకరకాల విన్యాసాలు చేస్తోంది. విసుగ్గా దాని మీట నొక్కి పాపాయినెత్తుకుంది షర్మిల. వంట గదిలోకెళ్లి పాలు కలిపి సీసాలో పోసి పాపాయి నోట్లో పెట్టింది. పాపని బుజ్జగించుతూ మళ్లీ ముందుగదిలోకొచ్చింది.

"యింతకూ మీ సుగుణమ్మ వాళ్లాయనకి చెప్పిందో, లేదో? అతను వెతుకుతున్నాడో లేదో!" సుశీల స్వగతంలా గొణిగింది.

"మందు పోసినాం గదా! పరవాలేదులే వదినా! తెల్లారితో డాక్టరు దగ్గరికి పోదాం" అంటూ మొదలు పెట్టింది షర్మిల.

"మా జరీనాకు పోయిన నెలలో నూట రెండు డిగ్రీల జ్వరం వచ్చింది. ఆ పొద్దు కూడా యీ మాదిరే జరిగింది. ఆయనేమో ఆడిటింగు పనుల్తో వూరంతా తిరగతా వున్నారు. రాత్రి

ఎనిమిదయినా ఇంటికి రాలేదు. బిడ్డకు వొళ్లు కాలిపోతా వుంది. వున్నట్టుండి అదొక మాదిరిగా పడిపోయింది. నా కేడుపొచ్చేసింది. బోరుమని యేడ్చేసినాను. కిందుండే యింటిగల్లామె పైకొచ్చి చూసి వాళ్లాయనని తోడు పంపించింది. ఆయన స్కూటర్లో వెనకే వస్తావుంటే నేను రిక్షాలో బయల్దేరి డాక్టరు దగ్గరికి పోయినాం. ఆ డాక్టరుకు కూడా కోపమొచ్చేసింది. అయిసు నీళ్లతో తుడవలేదెందుకని వురిమురిమి చూసినాడు. వెంటవెంటనే రెండు యింజెక్షన్లు పొడిచినాడు. యెప్పుడో రాత్రి పదిన్నరకు మా ఆయన ఆస్పత్రికొచ్చినారు. బిడ్డకు ఫిట్స్ వచ్చేదాకా వూరికే యెందుకున్నావని నా పైన మండిపడినారు. డిగ్రీ దాకా చదివిందెందుకని, డాక్టరు దగ్గరికెళ్లే పనైనా పెళ్లాం చెయ్యకపోతే నేనెట్ల బతకాల – అనీ వొకటే ఆగిత్యం చేసినారు. అప్పుడే మందులు తెచ్చిపెట్టి, డబ్బాలపైన యేది జరం మందో, యేది దగ్గు మందో, కడుపు నొప్పొస్తే యేది పోయాలో వివరంగా రాసిపెట్టినారు. అంతేగానీ టయం ప్రకారం యింటికి రాకపోయినందుకు ఆయనకు బాధే లేదు. యీ మాదిరి ఎదురు చూసీచూసీ నాకు అలవాటై పోయింది. అయినా మా ఆయనేమైనా మీ ఆయన మాదిరిగా లెక్చరరా యెప్పుడూ యింట్లో కూర్చునేదానికి? ఆడిటరుకు యింట్లో కూర్చుంటే జరుగుతుందా?"

"ఎదురుచూడ్డమనేది నాకు కూడా కొత్త కాదులే వదినా?" అంటూ తాను చెప్పసాగింది సుశీల. "పేరుకు లెక్చరరే గానీ వారు ఆ పని తప్ప మిగిలిన అన్ని పనులూ చేస్తూంటారు. వాళ్ల డిగ్రీ కాలేజీలో నెలలో సగం రోజులు స్ట్రయికులే గదా! వారి అసలు వుద్యోగం పబ్లిక్ రిలేషన్ ఆఫీసరు. ఆర్ట్సు లవర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఆయనే! యెన్సీసీ ఆఫీసరూ ఆయనే! బంధువులైనా, స్నేహితులైనా యెవరు యే పనిపైన మా వూరొచ్చినా వారి దగ్గరకే వస్తుంటారందరూ. వాళ్లు రావటమే ఆలస్యం. యిక ఆ పని పూర్తయ్యే వరకూ వారికి నిద్రపట్టదు. తిండి రుచించదు. హోస్టలు కొచ్చినట్టుగా భోజనానికీ, నిద్రకూ మాత్రమే యింటికి రావడం. అసలొకసారి భోజనం కూడా బయటే! యెవరికేం పని వచ్చినా, 'శ్రీనాథ్‌గారున్నారాండీ!' అంటూ యింటికొచ్చేస్తారు. తర్వాత ఆయనని పట్టలేం.

"మా యిల్లు సంగతేమిటా అంటే అదొక ఖార్కానా. ప్రొద్దున అయిదింటికి నిద్ర లేస్తానా, అయినా సమయానికి కాలేజీ కెళ్లలేను నేను. యెనిమిదింటికంతా టిఫన్లయిపోవాలి. తొమ్మిదికంతా వంట పూర్తవ్వాలి. కారుణ్యని కాన్వెంటులో దించి వచ్చాక చిన్నదాన్ని చైల్డ్ కేర్ సెంటర్లో వదిలిపెట్టి రావాలి. నన్ను మా కాలేజీలో దింపేసి మీ అన్నయ్యగారు తన కాలేజీకి వెళ్లాలి. వారి కాలేజీ వూరికో చివర్లో వుంటే, నా కాలేజీ యింకో చివర్లో వుంది. పెట్రోలు ఖర్చు చెప్పాల్సిన పనే లేదు. యిద్దరూ వుద్యోగాలు చేయటమంత బుద్ధి లేని పని యింకొకటి లేదంటే నమ్ము. అయినా ఇప్పుడు ఫర్వాలేదనుకో. ఉద్యోగంలో చేరిన కొత్తలోనయితే ప్రిపరేషన్‌కు సమయం దొరక్క చచ్చేదాన్ని. క్లాసులు అయిపోయినా వారొచ్చే దాకా కాలేజీలోనే అఘోరించాలి. వొకోసారి విసుగేసి రిక్షా ఎక్కి వెళ్లిపోతుంటాను. రిక్షాలకు పదులూ, ఇరవైలూ తగలేస్తున్నానని వారికి విసుగు. నన్ను గూడా స్కూటరో, మోపెడో నేర్చుకొమ్మన్నారు. ప్రయత్నించాను కూడా. నేర్చుకుంటూ కిందపడ్డానోసారి.

తర్వాత ముట్టుకోలేదు. అదీ వొకందుకు మేలే! యిలాగైతే ఇంటికీ, కాలేజీకి తిరిగేటప్పుడయినా కంటికి కనబడతారు. లేకపోతే అదీ వుండదు. అయితే వున్న బాధల్లా ఒక్కటే! ఎదురు చూడ్డం! కాలేజీలో ఎదురుచూడ్డం, ఇంట్లో ఎదురుచూడ్డం.. బాగా అలవాటైపోయింది..”

వీధిలో స్కూటర్ శబ్దం వినిపించడంతో ఆమె మాట్లాడటం ఆపి మెట్లకేసి చూపులు సారించింది. “అది పక్కింటాయన మోటారుబైకు... స్కూటరు సౌండు అట్లుండదు..” అంది షర్మిల.

లాలిత్య గౌను బొత్తాల్ని విప్పుతూ – “చెమటపోస్తోంది. బిడ్డకు జ్వరం వదులు తోందను కుంటా..” అంది సుశీల.

“జ్వరానికీ, మన వాళ్లకూ పోటీ పెడితే, జ్వరమే వోడిపోతుందిలే వదినా!” షర్మిల మెల్లగా నవ్వేసింది.

“బిడ్డకోవైపు జ్వరం వస్తోంటే వాళ్లెలా పార్టీలో కూర్చున్నారో చూశావా వదినా! యీరోజు వాళ్లని వూరికే వదిలిపెట్టగూడదు. జాడించి వదిలిపెట్టాలి..”

“నేనూ అట్లే అనుకుంటాను గానీ ఆయనొచ్చి ముందు నిల్చుంటే అయ్యో పాపమనిపిస్తాది నాకు... ఆడిటర్లంటే పెద్ద పెద్ద వాళ్లతో పనిగదా? నెలకయిదారు పార్టీలైనా వుంటాయి. ప్రతిసారీ యెప్పుడో అర్ధరాత్రికి యింటికొస్తారు. మందువాసన భరించలేనంత వుంటాది. యిట్లయితే వొళ్లేమయ్యేదని నేను యేడ్చి ఆగడం చేస్తే యీ మధ్య బాగా తగ్గించేసినారు. కానీ యీ మధ్యేవరో ఆయన ఫ్రెండు శబరిమల పోయొచ్చినాడంట. వాళ్లు వస్తావస్తా కారైక్కాల్ అని పాండిచ్చేరికి చెందిన వూరిమీదుగా వచ్చినారంట. ఆ వూర్లో మందు బాటల్సు తక్కువ ధరకు అమ్ముతారని తెలిసి తలా కొన్ని బాటల్సు కొనుక్కొని సీట్లకింద దాచిపెట్టుకుని వచ్చినారంట. యీయనకు గూడా రెండు బాటల్సు తెచ్చినారు. అవి మా యింటికొచ్చినప్పటి నుంచే మా ఆయన మీ ఆయన యెప్పుడొస్తారా, పార్టీ యెప్పుడిద్దామా అని యెదురుచూస్తానే వుండారు...”

“వారు కూడా చాలా రోజులుగా యిక్కడికి రావాలని అనుకుంటూనే వున్నారొదినా! చివరికి సమ్మర్ హాలిడేస్‌లో కుదిరింది. అన్నట్లు వారు గూడా డిసెంబర్లో శబరిమలై వెళ్లొచ్చారు. కారైక్కాల్ సంగతి వారికి తెలిసినట్టు లేదు. తెలిసుంటే ఆయనా కొన్ని బాటల్సు తీసుకొచ్చి జల్సా చేసి వుండేవారు...”

“శబరిమల వెళ్లేటప్పుడు చాలా నిష్టగా వుండాలంట గద వదినా?”

“అవును. చాలా మహత్యమున్న దేవుడాయన. అంటూ సొంటూ తగల గూడదు. ఆడాళ్లు చేసిన వంట గూడా తినగూడదు. నలభై రోజులు దీక్షలో వున్నారాయన. ఆ నలభై రోజులూ బ్రాహ్మణ హోటలు భోజనమే చేశారు...”

“అక్కడికి ఆడవాళ్లు పోకూడదంట కదా?”

“అవునవును. ముట్లు వుడిగిపోయిన ముసిలాళ్లూ, యెదగని ఆడపిల్లలూ వెళ్లొచ్చు...”

“అన్న మాదిరే మా ఆయనకు కూడా భలే భక్తి వదినా! ప్రతి దినమూ తెల్లారి జామున్నే నమాజుకు పోతారు. నిజానికి దినాని కైదు పూటలూ నమాజు చెయ్యాలని ఆయన కాశ. కానీ వుద్యోగులకు సాధ్యంగాదు కదా?”

"నువ్వెప్పుడూ మసీదు కెళ్లవా?"

"ఆడోళ్లెక్కడైనా మసీదుకెళ్తారా? యింట్లోనే నమాజు చదువుకుంటాను. మా యిండ్లలో మొగోళ్లకు రాకపోయినా ఫర్వాలేదు గానీ, ఆడోళ్లకు మాత్రం వుర్దూ చదివేది రావాల్సిందే. నేనుకూడా చిన్నప్పుడు వుర్దూ నేర్చుకున్నాను."

వూరంతా బాగా మాటు మనిగిపోయినట్టుంది. దూరంగా రైల్వేస్టేషను నుంచీ రైలు వేస్తున్న కూత స్పష్టంగా వినిపిస్తోంది. పాప నిద్రలోనే వులిక్కిపడుతోంది. షర్మిల వొళ్లోని పాపాయి నిద్రలోనే పాలసీసాని పక్కకు తోసేస్తోంది. సుశీల గోడ గడియారం కేసి చూసి, అది పనిచేయడం మానేసిందన్న విషయం గుర్తుతెచ్చుకుని "టయిమెంతయి వుంటుందో?" అంది.

పాపాయిని వుయ్యాలలో పడుకోబెట్టి వస్తూ షర్మిల చేతివాచీనీ వాకబు చేసి "పదకొండు కాబోతోంది..." అంది.

కాస్సేపు మౌనంగా వుండిపోయి, తర్వాత చివాల్న తలపైకెత్తి, "నాకు చాలా రోజులుగా వో కోరికుంటాంది. వారి నెలాగైనా యింట్లో వుండమని, నా కోసం వెయిట్ చెయ్యించాలి. అప్పుడు తెలుస్తుంది ఆయనకి నా బాధ..." అంది సుశీల.

"నువ్వయితే కాలేజీకైనా పోవచ్చు. నేనెక్కడికి పోయేది? పుట్టింటికైనా మా ఆయన సరిగ్గా పంపించరు...."

"మనం కూడా పార్టీ చేసుకుంటే సరి...." సుశీల కంఠం కసిగా వుంది.

"చేసుకుందామా? యింట్లో యింకో బాటిలుంది" తమాషా చేస్తున్నట్టుగా అడిగింది షర్మిల.

"యేం బాటిల్?"

"పేరు వోడ్కా అంట.... చాలా సాఫ్ట్ డ్రింక్ అన్నారాయన..."

"నువ్వు పుచ్చుకున్నావా యెప్పుడైనా?"

"ఆ వాసన చూస్తేనే వాంతొచ్చేసి నట్లవుతాది నాకు. అసలు మా పెండ్లయిన కొత్తలో అదే, హనీమూన్ కని బెంగుళూరుకు పోయినప్పుడు కబ్బన్ పార్కు రెస్టారెంటుకు పోయినాం. తోటలోనే కుర్చీలు. జంటలు జంటలుగా కూర్చోని అందరూ తాగడమే కార్లల్లో వచ్చిన జనాలు. ఆడోళ్లు కూడా మగోళ్ల మాదిరిగా బీరు తాగేసి, చక్కా సిగరెట్లు కాలస్తా వున్నారు. ఆయనేమో నాకూ వొక గ్లాసులో పోసి తాగమని బలవంతం చేసినారు. మందు మాదిరి వొక గుక్క మింగినానంతే! కళ్లల్లో నీళ్లు తిరిగి, వొళ్లంతా అదొక మాదిరయిపోయింది. తిట్టిన తిట్టు తిట్టకుండా ఆ గ్లాసు కూడా ఆయన తాగేసినారు. అసలు హనీమూనంతా ఆయన తిట్టేదానికే సరిపోయింది...."

"అక్కడికి నువ్వే మేలు. మాకు హనీమూనూ లేదు, గీనీమూనూ లేదు. పెళ్లయిన కొత్తలో మా యింట్లో రోజూ తగవులే!"

"యెందుకూ...?"

".... ...."

"యేం జరిగింది?"

"ఆ కథంతా యిప్పుడు తవ్వుకుంటే వొరిగేదేముందిలే?"

"అన్నకు పెళ్లికి ముందే..." షర్మిల కూతూహలాన్ని ఆపుకోలేకపోయింది.

"నీకూ తెలుసన్న మాట! ఆయన ఫ్రెండ్సు కందరికీ తెలిసిన బాగోతమేనట! నీకూ అన్నయ్య చెప్పే వుంటారు. కానీ మా వాళ్లకే పెళ్లయ్యే దాకా ఆ సంగతి తెలియనే తెలియదు. జాగ్రత్తగా మమ్మల్ని గోతిలోకి దింపేశారు వాళ్లు..."

"ఆ అమ్మాయిప్పుడేదుంది?"

"యేమో! యీ వైపునెక్కడా కాలేజీలో సీటు దొరకనట్టు మెడ్రాసు కెళ్లారు కదా వారు! యెమ్మే చదువుతూన్నప్పుడు పరిచయంట. ఆ పిల్ల తల్లిదండ్రులక్కూడా తెలుసునట. అసలు వాళ్లే యెక్కడో గుడిలో దండలు మార్పించి పెళ్లయినట్టనిపించార్ట. వారు చదువుతూనే కొన్నాళ్లు యిల్లు తీసుకుని సంసారం చేశార్ట. ఆ సంగతి తరవాతెప్పుడో మా అత్తమామలకి తెలిసి గగ్గోలు పెట్టారట. ఆ అమ్మాయికేదో డబ్బులు ముట్టజెప్పి వదిలించేసుకున్నారట. అయినా యేం వదిలించుకోటంలే? యిప్పటికీ నెలనెలా ఆయన జీతంలోంచీ వెయ్యి రూపాయలు బ్యాంకునుంచీ అలాగే దానికెళ్లి పోతాయి..."

"నువ్వెప్పుడూ దాన్ని చూడలేదా?"

"చూస్తే చంపేసెయ్యనూ మరి..."

"అన్న అక్కడికెప్పుడైనా పోతారా?"

"వెళ్లారని తెలిస్తే వూరుకుంటానా? పెళ్లయిన ఆరు నెలలకుగానీ ఆ సంగతి తెలియలేదు. తెల్సిన మరుక్షణం మా యింటికెళ్లిపోయాన్నేను. అప్పుడీ కారుణ్య కడుపులో వుంది. మా నాన్నగారయితే యిక అత్తవారింటికి పంపనే పంపననేశారు. వారొచ్చి పంపమని అడగలేదు. నాన్నగారు నానా కష్టాలు పడి కాలేజీలో వుద్యోగం తెప్పించారు. వుద్యోగం వచ్చిన రెండు నెలలకంతా మా మామగారు రాయబారం పంపించారు. వారుకూడా ప్రాధేయపడుతూ వుత్తరాలు రాయసాగారు. ఆ పిల్ల ముఖం చూడనని ప్రమాణాలు చేశారు. యేం చేద్దాం. చివరకు వాళ్ల వూరికే బదిలీ చేయించుకున్నాను. దాదాపు రెండేళ్ల తరువాత మళ్లీ కాపురం మొదలెట్టాం. అయితే నేను గట్టిగా పట్టుబట్టి వేరే కాపురం పెట్టించాను..."

"అయితే మీ అత్తా, మామా కూడా మీ వూర్లోనే వేరుగా వుండారా?"

"అవును"

"అన్న వొప్పుకున్నారా దానికి?"

"అసలు వేరే కాపురం పెట్టాలని పెళ్లయిన కొత్తలోనే వారనుకున్నారు. ఆ యింట్లో వొకరిని చూస్తే యింకొకరికి కాదు. అందరూ డబ్బు మనుషులు. వాళ్లు మాట్లాడుకొంటూంటే వ్యాపారస్తులు మాట్లాడుకొంటున్నట్టే వుంటుంది..."

"అదే మేలులే వదినా, లోపలొకటి బయటికొకటిగా బతికే దానికంటే! మా మామ లేరులే. అత్త ఉండాది. బావలూ, మరుదులూ, ఆడబిడ్డలూ పెద్ద కుటుంబం. వొకరిని చూస్తే యింకొకరికి

ప్రేమ కారిపోతాది. యెవరికి వాళ్లు వాళ్ల సంసారానికని అన్నీ దాచి పెట్టుకుంటారు. యీ వూర్లో ప్రాక్టీసు పెట్టినారు కాబట్టి సరిపోయింది గానీ, లేకపోతే ఆయన వేరే కాపురం పెట్టే వుండరు. వాళ్లేమో నన్నా పొయిలో పెట్టి యీ పొయిలో తీసుంటారు. యీయనకేమో వాళ్ల మాటే యిష్టం. అంతెందుకు? మీ అన్న నన్ను చూడనైనా చూడకుండా పెళ్లి చేసుకున్నారు తెలుసునా?"

"నిజంగా?"

"అవును. వాళ్లమ్మ, అక్కచెల్లెళ్లు, వదినలు ఎవర్ని చేసుకొమ్మంటే వాళ్లనే చేసుకుంటానని చెప్పేసినారంట. వాళ్లందరూ వచ్చి చూసి ఫిక్స్ చేసుకున్నారు. అసలు పెండ్లికి ముందు ఫోటో అయినా పంపించమని చెప్పమని మా ఫ్రెండ్సు గొడవ చేసినారు. ఫోటో లేదు, యేమీ లేదు. పెళ్లయినాకే నేనాయన ముఖం చూసింది"

"ముస్లింలలో అది సంప్రదాయమేనటకదా!"

"అది వొకప్పటి సంగతి. యిప్పుడందరూ పెండ్లి చూపులు చూస్తా వుండారు. యీయనొక్కరు నా ప్రాణానికీ మాదిరి దొరికినాడు. మా పెండ్లయినప్పుడు నాకు ఇరవై అయిదు, ఆయనకు ముప్పయ్యా వయస్సు. పెండ్లి కోసరం నాల్గుగైదేండ్లు యెదురుచూసినా ననుకో. యెట్లాంటి మొగుడో తెలుసుకోవాలంటే ఆరు నెలలు యెదురుచూడాల్సి వచ్చింది. పెళ్లయినాక యీ మాదిరిగా రోజూ యెదురుచూస్తానే వుండాను. యీ వుద్యోగంలో నన్ను మించి నోళ్లెవురూ వుండరు" షర్మిల నవ్వుతోంటే విసుక్కుంటోందో, ఆనందిస్తోందో అర్థం కావడం లేదు.

"ఆ పనిలో నాది డిస్టింక్షను" అంటూ సుశీల తన వాదన మొదలు పెట్టింది. "కాలేజీలో వెయిట్ చేసీ చేసీ విసుగొచ్చి చచ్చిపోదామన్నంత కోపం వస్తోంటుంది. నాకు వొకోసారి బీపీ వచ్చేస్తుందేమో నన్నంత టెన్షను. మా ప్రిన్సిపాల్ రాక్షసి. పది నుంచీ నాలుగుదాకా కట్టు కదలనివ్వదు! యీయనగారేమో ప్రొద్దున యెంతకూ కదలరు. సాయంత్రాల్లో సమయానికి రారు. వాళ్ల ప్రిన్సిపాల్ ధర్మాత్ముడు. యెగ్జామ్స్ డ్యూటీలప్పుడు నా గతి భగవంతుడికే తెలుస్తుంది. పిల్లలొకవైపు యేడుస్తుంటారు. అవతల ప్రిన్సిపాల్ రుసరుసలాడుతుంటుంది. వారికి నిమ్మకు నీరెత్తదు. యిప్పుడు మేలేలే! పెళ్లయిన కొత్తలో నాకుద్యోగం లేదు గదా? యీయన యెంతకూ యింటికొచ్చేవారు గాదు, వెయిట్ చేసి చేసీ కళ్లు కాయలు కాసేవి. తర్వాతేమో మా పుట్టింట్లో రెండేళ్లున్నాను. నిజానికది యింకా పెద్ద వెయిటింగ్. మధ్యలో చాలా గొడవలు జరిగాయి. రాయబారాలూ, సంప్రదింపులూ జరిగాయి. కానీ వారు మాత్రం నాకంట పడలేదు. ఆ రెండేళ్లూ ఆయన కోసం ఎదురుచూసినట్టే లెక్క. వొకోసారి బీపీ వచ్చేసిందనే అనుకునేదాన్ని. నా యెదురుచూడ్డం ముందు నీదేముందిలే?"

మంచంపైన పడుకున్న కారుణ్య యిటూ అటూ దొర్లి, పైకి లేచి కూర్చొని యేడవసాగింది. "సరిగ్గా పడుకోవే అంటే వినవు గదా? ఆకలిగా వుందా చెప్పు?" అంటూ విసుక్కొంది సుశీల.

షర్మిల పాలు కాచి కారుణ్య చేత తాగించింది. సుశీల లాలిత్య నెత్తుకుని మంచంపైన కారుణ్య పక్కనే కూర్చుంది. కారుణ్య మళ్లీ నిద్రపోవడానికి ప్రయత్నించింది. వంటింటిలోంచీ

యెలుకలు పాత్రలు దొర్లిస్తున్న చప్పుడు వినిపిస్తోంది. ఫాను సైతం విసుగ్గా దబడబ లాడుతోంది. స్కూటరొకటి యింటిముందు ఆగిన శబ్దం వినిపించింది. సుశీల దృష్టి మెట్లవైపునకు మరల్చింది.

"యింటిగల్లాయన స్కూటరు" అంది షర్మిల.

లాలిత్య వొళ్లు మళ్లీ మినమిన మంటోంది. "డాక్టరు దగ్గరికెళ్లి వో ఇంజెక్షను వెయ్యించి వుంటే బావుండేది" సుశీల గొణుక్కుంది.

షర్మిల పైకిలేచి "వొకసారి కిందింటి కెళ్లి యింటిగల్లామెను చూసి వస్తాను. వాళ్లాయనకు మన వాళ్లేమైనా కనిపించి నారేమో అడగతాను" అంటూ వరండాలోకొచ్చి మెట్లు దిగి కిందికి వెళ్లిపోయింది.

సుశీల వంటింటిలోకెళ్లి రెండు గ్లాసుల నీళ్లతో కడుపునింపుకుని మళ్లీ పిల్లల దగ్గరికొచ్చి వాళ్ల పక్కనే నడుం వాల్చింది. లాలిత్యకు టెంపరేచరుండేమోనని చూసి, కారుణ్య పైకి శాలువ లాగింది. కాస్సేపు ఆగిపోయిన గోడ గడియారం కేసి కోపంగా చూసింది. గడియారం పక్కన రెక్కల పురుగుతో దాగుడుమూత లాడుతున్న బల్లిపైన దృష్టిని కేంద్రీకరించడానికి ప్రయత్నించింది.

అయిదు నిముషాలు గడిచినా షర్మిల పైకి రాలేదు. మరో అయిదు నిముషాల తర్వాత ఇంటిముందు స్కూటరు శబ్దం వినిపించింది. సుశీల పైకిలేచి వరండాలో కొచ్చింది.

మెట్లెక్కుతూ "యింటిగల్లాయనను వొకసారి అక్కడికెళ్లి చూసి రమ్మని అడుక్కున్నాను" అంది షర్మిల.

"యెక్కడికి?"

"అక్కడేదో యాక్సిడెంటు జరిగిందంట..."

షర్మిల గొంతు బొంగురుపోతోంది. కళ్లల్లోంచీ నీళ్లు దుముకుతున్నాయి.

"యాక్సిడెంటా?... యెక్కడ...." సుశీల నిలువునా వొణికిపోతూ గోడపైకి వొరిగి పోయింది. షర్మిల గాలిలో గడ్డిపోచలా వూగిపోతోంది.

"గాంధీరోడ్డు క్రాసులో... స్కూటర్ని లారీ గుద్దేసిందంట! ట్రాఫిక్ జామ్మయి, లేటుగా యింటికొచ్చినానని యింటిగల్లాయన అన్నారు. నాకేమో భయంగా వుంది. తెల్లరంగు స్కూటరని ఎవరో అంటావుంటే యింటిగల్లాయన విన్నాడంట... సంగతి తెలిసి యింటిగల్లామె మొగుడ్ని చూసి రమ్మని తరిమింది..."

"వూర్లో తెల్ల స్కూటర్లెంతమందికి లేవు..." సుశీల మాటలు తనను తాను వోదార్చు కుంటున్నట్టుగా వినిపిస్తున్నాయి.

"యేమో! నాకు భయంగా ఉంది... ఆయన స్పీడుగా డ్రైవ్ చేస్తారు. రాత్రుల్లో ట్రాఫిక్ వుండదని యింకా స్పీడుపెంచేస్తాడు. పైగా పార్టీ..." ఆమె గొంతు వణుకుతూనే వుంది.

"మన వాళ్లయి వుండరులే వదినా! లోపలికిరా... వెంట మా ఆయనున్నారు. కదా... ఆయన జాగ్రత్తగా వుంటారెప్పుడూ..." సుశీల బలవంతంగా యేడుపు నాపుకుంటోంది.

షర్మిల కుర్చీలో కూర్చుని కాళ్లు పైకెత్తి గుండెలకదుముకుంది.

సుశీల పిల్లల పక్కన కూర్చుని చీర కొంగుతో కళ్లు తుడుచుకోసాగింది.

గోడపైన బల్లి బిగ్గరగా అరుస్తోంది. సైలెన్సరు లేని వాహన మొకటి కారుబారు చేస్తూ పరుగెడుతోంది.

"కోపమొస్తే మా ఆయన స్పీడుగా డ్రైవ్ చేస్తారు..." గ్రుక్కిళ్లు మింగుతూ అంది షర్మిల.

"యిప్పుడేమీ కోపం లేదు గదా!" సుశీల సముదాయించింది.

"యీరోజు తెల్లారి ఆయనకు కోపమొచ్చింది వదినా! నిన్న ఆయన కొక జాబు వచ్చింది. అడ్రసు చూస్తే ఆడవాళ్ల అక్షరాల మాదిరిగా అనిపించింది. ఆ మాటంటే ఆయన కెక్కడలేని కోపం వచ్చింది. అప్పటినుంచీ నాతో సరిగ్గా మాట్లాడనే లేదు..."

"వుత్తరం పైని రాతని చూసి అనుమానించచ్చా..."

"జాబులు మాత్రమే గాదు. నేనెప్పుడైనా మా వూరికి పోయినప్పుడు ఎవరెవరో ఆడోళ్లు యింటికొచ్చి పోతారని యింటిగల్లామె చెప్పింది. ఆయన్నడిగితే ఆఫీసులో పనిచేసే క్లర్కులని చెప్తారు..."

"వుత్తరం చింపి చదవలేకపోయావా?"

"చదవాలంటే నాకు భయం. తెరిచి చూస్తే అది ఆడపిల్ల రాసిందే అయితే యేం చేసేది? తెలియకుండా వుంటేనే మేలు... అసలా సంగతి ఆయన్నడగాలంటేనే భయం నాకు. యీ పొద్దెందుకో బుద్ధిలేక అడిగేసినాను. ఆయనకు కోపం వచ్చేసింది. ఛీ... నాకు..., అయ్యో... పాపం... ఆయన..."

"కోపం తెచ్చుకునే వాళ్లే మేలులే వదినా! మా వారి లాగా మనసులోనే దాచుకునే వాళ్లతో యెప్పటికైనా మోసమే!... మరి... యింతకూ ఆ యాక్సిడెంటు... నిజంగా... వీళ్లు..." సుశీల ముక్కు చీదుకుంది. "వారికి ఫ్రెండ్సుతో కలిస్తే యిక వొళ్లు తెలియదు. గంటల తరబడీ తిరుగుతుంటారు... యేమైనా అంటే రెండు లక్షలకు యెల్లయిసీ చేసినాన్లేవే అని వేళాకోళం. అప్పటికీ నే నేదో..." యేడుపు ముంచుకు రావడంతో ఆమె మాట్లాడలేకపోయింది.

షర్మిల కన్నీళ్లు రాల్చుతున్న కనురెప్పల్ని బలవంతంగా మూసుకుని వణుకుతున్న పెదవులతో ప్రార్థన మొదలుపెట్టింది.

సుశీల పిల్లల ముంగురుల్ని సవరించుతూ వెక్కిళ్లు ఆపుకునే ప్రయత్నం చేయసాగింది.

కాస్సేపటి తర్వాత చేతులు ముద్దుపెట్టుకుని ప్రార్థన పూర్తిగావించి కళ్లు తెరిచింది షర్మిల.

ఆమె వైపుకు చూసే ధైర్యం చాలక దృష్టి మరల్చుకొంది సుశీల.

గది గుమ్మం దగ్గరి బూట్లూ, అలమారులోని పుస్తకాలూ, లోపలి గదిలో కొక్కానికి వేలాడుతున్న పాంటూ, వంటగదిలోంచీ కనిపిస్తోన్న హాట్ బాక్సూ – అన్నీ తన వేదనని రెట్టింపు చేస్తున్నట్టుగా అనిపించసాగింది షర్మిలకు. వీధిలో యే చప్పుడు వినిపించినా ఆమె వులిక్కిపడ సాగింది. దూరంనుంచీ వినిపిస్తున్న స్కూటర్ సవ్వడి దగ్గరికి వచ్చేస్తే యెలాగన్న భీతి చెలరేగసాగింది. తమ గోడ గడియారంలా ప్రపంచం కూడా పనిచేయడం మానేసి, యెక్కడిదక్కడ ఆగిపోతే బావుండుననిపించింది.

ఆమె గుండెల సవ్వడిని వేళాకోళం చేస్తున్నట్టుగా దూరంనుంచీ రకరకాల శబ్దాల్ని మొదలెట్టిన స్కూటరొకటి యెకాయెకిన తన శరీరంపైకొచ్చి నిల్చున్నట్టు ఆమెకు అనిపించేలా వాళ్లింటి ముందుకొచ్చి ఆగింది.

యిద్దరూ వొక్క వుదుటున వరండాలోకొచ్చి నిల్చున్నారు. వొకరి గుండెల సవ్వడి యింకొకరికి వినిపిస్తున్నట్లుగా వుంది యిద్దరికీ... యిద్దరి శరీరాలూ చెమటతో తడిసిపోయాయి.

"అమ్మా షర్మిలా! ఆక్సిడెంటయిన స్కూటరు అక్కడే పడివుందట. మనుషుల్ని మాత్రం హాస్పిటల్‌కు తీసుకెళ్లారట... మా ఆయనకు మీ స్కూటరు బాగా తెలుసు కదా! అది మన స్కూటరు కాదటలే. నువ్వు భయపడాల్సిన పని లేదు..." అంటూ కిందినుంచే యింటిగల్లావిడ బిగ్గరగా అరిచి చెప్పింది.

సుశీల షర్మిల భుజంపైన చేయి వేసింది. ఇద్దరూ వొకరినొకరు ఆసరాగా చేసుకొని అలాగే నిల్చున్నారు. కాస్సేపు గడిచాక నెమ్మదిగా కదిలి ఇద్దరూ ఇంటిలోకొచ్చారు. ఇద్దరూ నేలపైన కూర్చుని గోడకు చేరగిలబడ్డారు. వుచ్ఛ్వాస నిశ్వాసాలు యెగసెగసి పడుతుండగా యిద్దరూ వొకరినొకరు చూసుకున్నారు. యెందుకో అమాంతంగా యిద్దరికీ సిగ్గు ముంచుకొచ్చింది.

సుశీల పెదవుల్ని సాగదీసి, "మీ గుమస్తా అసలు వెతకడం కోసం వెళ్లాడో లేదో! యింతకూ అతడి పెళ్లాం అతడికా వర్తమానం చేరవేసిందో లేదో..." అంది.

"యేమో!... అయినా మనకంటే సుగుణమ్మే మేలు. మాటాడకుంటే పోయింది. మొగుడనే మనిషి కండ్లముందర పడుంటే చాలును" షర్మిల కంఠంలో విసుగు, బాధ, కోపం వొకసారిగా ధ్వనించాయి.

కాస్సేపు ఆలోచించాక, "అదీ వొక రకమైన యెదురుచూడ్డమే గదా! మొగుడితో సామరస్యం కోసం, సుఖమైన సంసార జీవితం కోసం, వొకే కప్పు కింద వుంటూ, యేళ్ల తరబడి యెదురు చూడ్డం... అంతే.... తేడాల్లా అంతే!..."

వీధిలో గూర్ఖా బెత్తంతో నేలను మోదుతూ, నాలుగడుగుల కోసారి విజిల్ వేస్తూ వెళ్తున్నాడు. ఆటో వొకటి గుడుగుడుమని చప్పుడు చేస్తూ యెటో వెళ్తోంది.

బాగా దూరంనుంచీ, చీకటి బాజా పైన చిన్న చిన్న గులకరాళ్లు విసురుతున్నట్టుగా మెల్లగా శబ్దం....

"ఆయన స్కూటరు కూడా ఆ మాదిరి శబ్దం... చేస్తుందప్పుడప్పుడూ...." అంటూ వరండాలోకి నడిచింది షర్మిల.

"అది మనవాళ్ల స్కూటరు కాకపోయినా ఫర్వాలేదులే వదినా! కావాలంటే పాపకు యింకోసారి ఆ మందే పోస్తాను. తెల్లవారిపోయినా ఫర్వాలేదు. వాళ్లు క్షేమంగా యిల్లు చేరితే అంతే చాలు..." అంది సుశీల.

షర్మిల పిట్టగోడ పైన్నుంచీ ముందుకు వంగి "యెప్పుడో యిట్ల వొంగుతూ, కాలు జారి కిందపడి చస్తానేమో నేను..." అని మరోసారి అనుకొంది. సుశీల చూపులు వరండా మెట్లవైపుకూ, షర్మిల చూపులు వీధి మలుపు దగ్గరికీ కదిలాయి.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 3-9 నవంబర్ 93